# పిడికెడు బియ్యం



**—పి. గణపతి శాస్త్రి**

చవక రేషన్ బియ్యంషాపు దగ్గిర జనం తేనెటీగల్లాగ గుంపులుగా గుమిగూడి గొడవ చేస్తున్నారు. ఆ రేషన్ కొట్టు ఇంకా తెరవలేదు!

'ఇది ఇంకా ఎప్పటికి తెరుస్తారో. బగుమంతుడా!' అనుకుని దిగులుగా మూలిగింది మంగమ్మ.

చలికాలం. సాయంత్రం సుమారు నాలుగు గంటలయింది. ఆకాశంలో అంతటా దట్టంగా మబ్బు పట్టింది. అప్పుడప్పుడు పడుతున్న చిన్న చిన్న వానజల్లులతో ఆ మహా పట్టణంలో ఆ వీధిలో రోడ్డంతా చితచితలాడుతూంది,

"ఈ కొట్టింకా ఎప్పటికి తెరుస్తారు బాబూ?" పక్కనే సంచీతో నిలబడిన ఒక ముసలాయన కేసి చూసి నెమ్మదిగా అడిగింది మంగమ్మ.

"ఏమో, ఎవరు చెప్పగలరు? అడిగే నాథుడేడీ! ఎవరికి పుట్టిన బిడ్డ పురా, వెక్కెక్కి ఏడుస్తావన్నట్టు మన గొడవ పట్టించుకునే వా రెవరమ్మా!"

కొంచెం ఓదారుస్తూ అన్నాడా తగు మనిషి.

మంగమ్మ కిద్దరు పిల్లలు. తొలి చూలు బిడ్డ వెంకటేశు సైకిల్‌షాపులో పని చేస్తున్నాడు. పొద్దస్తమానము రెక్కలు ముక్కలు చేసుకుంటే వాడికి ఏభై రూపాయలు చేతి కందుతాయి.

వెంకటేసు మంచి మార్కులతోనే ఫోర్తుఫారం గడిచి గట్టెక్కాడు. కాని, ఆ పైన చదువుకునే తాహతు లేక, సైకిల్‌షాపులో కుదురుకున్నాడు. వాడి కిప్పుడు పదిహేనేళ్ళు. వెంకటేశు తరవాత చాలా కాలానికి కలిగిన రాజీకి ఇటీవలే ఎనిమిదేళ్ళు నిండాయి.


వెంకటేశు చేత పెద్ద చదువు చదివిస్తే ముందు ముందు తమ కష్టాలన్ని గట్టెక్కి తీరతాయని ఎంతయినా ఉబలాటపడింది మంగమ్మ. గాలిలో ఎన్నెన్నో మేడలు కట్టుకుంది. కాని, అవన్ని ఒక్కసారిగా నేలమీద కూలి పోయాయి. మంగమ్మ భర్త రాయిలాంటి మనిషి. అతగాడు లారీడ్రైవరుగా పని చేస్తూ కొడుకు నెలాగయినా పైకి తీసుకురావాలని కలలు కంటూండే వాడు. కాని అకస్మాత్తుగా అర్ధరాత్రి వేళ జరిగిన రోడ్డు ప్రమాదంలో చని పోయాడు.

మరి వేరే దిక్కు లేక మంగమ్మ అప్పటినించి కూతురు రాజీతోబాటు పక్క వీధిలో ఏడెనిమిది ఇళ్ళలో పని చేస్తూ ఎలాగో అలాగ తన సంసారం నెట్టుకు వస్తూంది. ఇంకా ఎవరయినా రేషన్ బియ్యము, పంచదార, పొలసీసాలు వగైరా తెచ్చి పెట్టమని అడిగితే, అవి కూడా వారి కందిస్తూ తృణమో, పణమో తీసుకుంటూఉంటుంది. అయినా ధరవరలన్ని విపరీతంగా పెరిగిపోతున్న ఈ రోజుల్లో ఆమె కా పూట జరగడమే గగనంగా తయారయింది.

ఆ వేళ ఆమె పనులన్ని ముగించుకుని, తన రేషన్ బియ్యం కోసం, పంచదార కోసం బయలుదేరింది. పంచదార మంగమ్మ స్వంతానికి వాడుకోదు. అది ఎవరికయినా అమ్మి, ఆ సొమ్ముతో ఉప్పో పప్పో కొనుక్కుంటుంది. బియ్యం సంచీ చేతపట్టుకుని, చిన్న పంచదార సంచీ రాజీ కిచ్చి, ఆ పిల్లతో ఆ రేషన్ షాపు దగ్గిర పడిగాపులు పడి నిలబడింది. ఎంతసేపు అలాగ నిలబడాలో మరి!

అంతలోనే క్యూలో జనం కొంత మంది ముందుకి తోసుకు వెళ్ళి, కొట్టు తలుపుమీద దబదబా బాదారు. ఎక్కడ ఏ విధమయిన అలికిడి వినబడలేదు. మరి కొంతసేపు అలాగే నిలబడి మళ్ళీ బాదారు.

ఆ తరవాత తలుపులు తెరుచుకున్నాయి. గళ్ళలుంగీతో, చారల బనియన్‌తో కొట్టు ఆసామీ లోపలి నించి ఊడిపడ్డాడు. బాగా మాసిన గడ్డంతో, కోరమీసాలతో, కొంచెం ఎర్రబడిన కళ్ళతో జనం మీది మీదికి వచ్చి ఉరిమి చూశాడు.




"ఏంటయ్యో, ఆ గోల? తలుపులు గాని ఇరగ్గొట్టేత్తా రేంటయ్యో? అంతా గునిగుగూడి అలాగ దొమ్మీ సేత్తే ఎలాగ? 'క్యూ'లో ఏలబడండ్రి!"

అయినా, ఆ గుంపులో ఎవ్వరు వరసగా నిలబడలేదు. అంతలోనే వంగా కుదిమట్టంగా పొట్టిగా ఉన్న ఒక మనిషి ఆ గుంపులోనించి మరింత దురుసుగా విస్సుసున్నాడు.

"ఎంత సేపటికి కొట్టు తెరవకపోతే ఏం జెయ్యనున్నావు? ఎంతసేపని ఇలాగ నుంచోడం?"

కొట్టు ఆసామీ ఆ సమాధానంతో కొంచెం తగ్గాడు. తానే దిగి వచ్చి, అక్కడ గుమిగూడిన కొంత మందిని క్యూలో నిలబెట్టాడు. మిగిలిన జనం వానజల్లు పడుతుందేమో అన్న భయంతో ఆ ఇంటి చూరుకింద నిలబడ్డారు.

చింపిరిజుట్టుతో, సొట్టలు పడిన బుగ్గలతో, చేతిలో సంచితో ఆ క్యూ మధ్యలో నిలబడింది మంగమ్మ. గుండ్రని పెద్ద కళ్ళతో, చిందర వందరగా ఉన్న జుట్టుతో, చిన్న పంచదార సంచీతో తల్లికి పక్క పక్కనే నడుస్తూ నెమ్మది నెమ్మదిగా ముస్ముందుకు సాగిపోయింది రాజీ. ఆ పిల్ల ముఖం మీద ముంగురులు కొన్ని జీరాడాయి.

రాజీలో చురుకుపా లెక్కువ. బళ్ళో చదువుకునే రోజుల్లో అందరి లోను తెలివయినదని అనిపించుకుంది. ఆట పాటల్లోనే కాక, పని పాటుల్లోకూడా ఎప్పుడూ నవ్వుతూ పేలుతూంటుంది. వాన చినుకులు పడి తడుస్తున్న ముంగురులు వెనక్కి నెట్టుకుంటూ, ఆ గందర గోళం అంతా చూసి బెదురుతూ అమాయకంగా నవ్వుతూ అలాగే ముందడుగు వేసింది.

ఆ పైన కొట్టు ఆసామీ మంగమ్మ రేషన్ గార్డు తీసుకున్నాడు. పరిశీలనగా చూసి పక్కనే ఉన్న పొడుగాటి పుస్తకంలో నంబరు రాసుకున్నాడు, కార్డు మీద పెన్సిల్ తో గుర్తు పెట్టి, మంగమ్మ దగ్గిర డబ్బు తీసుకున్నాడు. తాపీగా బియ్యం కొలిచి ఆమె సంచీలో పోశాడు.

పంచదారకూడా కావాలంది మంగమ్మ. ఆ వారం కోటా ఇంకా అందలేదన్నాడు కొట్టుఆసామీ. కాని, ఎవ్వరు నమ్మలేదు. అంతలోనే మంగమ్మ వెనక నిలబడిన ఇంకొక పనిమనిషి కేసి చూసి, ఇంక బియ్యంకూడా లేవన్నాడు. తిరిగి రేపు సాయంత్రానికి వస్తే బియ్యం మాత్రం ఇవ్వగలనన్నాడు. అంతే!

ఉసూరుమని నిట్టూర్చింది మంగమ్మ. ఆమె కళ్ళలో నీళ్ళు నిండాయి, క్యూలో నిలబడిన జనం మరి భరించలేకపోయారు. క్రమక్రమంగా పెద్ద గొడవ బయలు దేరింది. ఒక పెద్ద గొంతు గట్టిగా గద్దించి అడిగింది.

"బియ్యం లేకపోవడ మేమిటయ్యో, ఆ మూల బియ్యం బస్తా కనిపిస్తూం డేను? ఆ బస్తా విప్పి బియ్యం కొలవ్వయ్యో?"

వెంటనే ఇంకొక పెద్ద కేక వినిపించింది.

"కొలుస్తావా, కొలవ్వా? లేకపోతే మమ్మల్నే కొలుచుకో మన్నావా? ఏం, మాటాడవేం?"

కొట్టు ఆసామీ గుండె కొంచెం బేజారయింది. అయినా, తమాయించుకున్నాడు. ఆ బస్తాలో ఉన్నవి బియ్యం కానేకావు పొమ్మన్నాడు. కందులు, మినుములు, పెసలు మొదలయిన ఇంకా కొన్ని దినుసులుకూడా అమ్ముతాడు ఆ ఆసామీ. అందుచేత, ఆ వంక పెట్టి ఆ బస్తాలో ఉన్నది పట్టి తవుడే అని గట్టిగా బుకాయించాడు.

కాని, క్యూలో నిలబడిన వాళ్ళు ఎవళ్ళు అది నమ్మలేదు! అంతా వచ్చి అబద్ధమని కేకలు మొదలుపెట్టారు, ఒక్క అంగలో ఆ క్యూ అంతా దుకాణం లోపలికి చొరబడింది! "ఇది బియ్యమూ టే! తవుడుబస్తా కాదు! బ్లాకులో అమ్మకానికే ఈ మోసం అంతా!" అని ఆ తరవాత ఇంకొక కేక వినబడింది!

క్యూలో నిలబడిన జనంలో కొందరు ఆ బస్తా విప్పి, చేతికి చిక్కినంత బియ్యం తమ సంచీలలో పోసుకున్నారు. మంగమ్మ, రాజీ ఆ పెనుగులాటలో ఆ గదిలోనించి బయటపడలేక చాలా సేపు సతమత మయ్యారు, ఆ గొడవలో బస్తాలో బియ్యం కొంత పోగులు, పోగులుగా నేలమీద పడింది. మరికొన్ని నిమిషాల లోనే ఆ గదిలో లైటు ఎవరో ఆర్పే శారు. మంగమ్మ కెటు వైపు చూసినా రాజీ ఎక్కడా కనబడలేదు. "రాజీ! రాజీ!" అని గట్టిగా పిలుస్తూ వీధి గుమ్మం దాటి అతి కష్టంమీద రోడ్డు మీదికి రాగలిగింది.

ఆ కొట్టు ఆసామీ అంతకు మునుపే గుండె బాదుకుంటూ "అయ్యో, కొట్టు దోచుకుంటున్నారు! దోచుకుంటున్నారు! దోపిడీ! దోపిడీ!" అని గొంతెత్తి కేకలు పెట్టాడు.

ఆ మహా పట్టణంలో, ఆ ప్రాంతంలో అంతా అప్పటికి మేలుకుంది. దగ్గిరలోనే పోలీసుల ఈలలు ఒక దాని వెంట వేరొకటి గింగురుమని మారు మోగాయి. క్యూలో జనం కొందరు అవి విని పారిపోయారు. ఆ తరవాత పోలీసులు అక్కడికి రావడం జరిగింది.

మంగమ్మ తన బియ్యంసంచీ గట్టిగా రెండు చేతులతోను అదిమి పట్టుకుని జనసమ్మర్దంలో నించి తప్పుకుని బయటపడింది. అక్కడకూడా రాజీ కనబడ లేదు. మళ్ళీ మళ్ళీ గట్టిగా పిలిచింది. జనం తొక్కిడిలో ఒక వేళ ఎక్కడయినా పడిపోయిందేమో అనుకుని భయపడి నాలుగు వైపుల పరకాయించి చూసింది. రాజీ కనబడలేదు! రేషన్ దుకాణంలో లోపలికి కూడా చూసింది. అక్కడకూడా లేదు! ఆ బియ్యం సంచీ ఇంట్లో పడవేసి, రాజీ కోసం వెతుకుదామనుకుని తొందరగా తన వీధివైపు సాగిపోయింది.

ఆ వీధి చివర ఉన్న మంగమ్మ పూరిల్లు చాలా చిన్నది. వీధి అరుగు పక్కనే ఒక గది. ఇంటిలోపలకూడా ఒకటే గది. దాని మధ్యన ఒక తడిక అడ్డం కట్టి, ఒక భాగం వంటగదిగా, వేరొక భాగం పడకగదిగా అమర్చుకుంది మంగమ్మ.

'పిల్ల ఏమయిపోయిందో! ఒక వేళ తప్పిపోయిందేమో!' అనుకుంటూనే కళ్ళమ్మట నీళ్ళతో త్వరగా ఇంటికి చేరుకుంది. గుమ్మంలో అడుగు పెడుతూనే వీధి గదిలోకి చూసి నిలువునా నిర్ఘాంతపడింది. పసిపిల్ల లిద్దరు లక్క పిడతలతో బువ్వా లాట ఆడుకుంటున్నారు. ఆ సంతోషంలో తల మునకలయి, వంటకాలేవో చేసుకుంటున్నారు. వారి నవ్వులు, కబుర్లు వింటూ క్షణకాలం తన కష్టాలన్నీ మరిచిపోయింది మంగమ్మ.

వారిలో ఒక పిల్ల రాజీ! ఇంకొక పిల్ల ఆమె స్నేహితురాలు రాణి.

రాజీ తన పక్కనే పెట్టుకున్న చిన్న సంచీలో నించి పిడికెడు రేషన్ బియ్యం తీసి కొంచెం కొంచెంగా లక్కపిడతల్లో పోస్తూంది. 'ఇంట్లో ఒక్క బియ్యం గింజకూడా లేదే! ఎక్కడివి చెప్మా ఈ బియ్యం?' అనుకుంటూ మళ్ళీ విస్తుపోయింది మంగమ్మ.

క్షణంలో ఆమె కంతా బోధ పడింది. రేషన్ షాపులో జనం పెనగులాటలో కొంత బియ్యం నేలమీద పోగులు, పోగులుగా పడింది. ఆ పోగులల్లో నించి పిడికెడు బియ్యం తీసుకుని తన సంచీలో పోసుకుని, ఒక్క పరుగులో రాజీ ఇంటికి వచ్చి వేసిందని గ్రహించడానికి మంగమ్మ కెంతో సేపు పట్టలేదు!

తను పేదరికంలో అడుగడుగునా ఎదురవుతున్న యాతనలన్నీ మరిచిపోయి, అమాయకంగా హాయిగా, ఆడుకుంటూ నవ్వుకుంటూన్న రాజీకేసి చూస్తూ అలాగే నిలబడిపోయింది మంగమ్మ. *